మరో ప్రజా సంకల్పం

Maro Praja Sankalpam • Main Edition

పోలీసు రక్షణ.. సీసీటీవీ నిఘా

నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులకు అవసరమైన పోలీసు రక్షణ కల్పించాలని సుప్రీంకోర్టు డీజీపీని ఆదేశించింది. నామినేషన్ కేంద్రాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కవరేజీ ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అభ్యర్థులు భయాందోళనలు లేకుండా నామినేషన్లు దాఖలు చేసే పరిస్థితులు కల్పించాలని పేర్కొంది. స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష అభ్యర్థులకు రక్షణ కల్పించడంలో పోలీసు యంత్రాంగం విఫలమవుతోందని వైయస్సార్‌సీపీ ఆరోపిస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లకు సంబంధించి ఎన్నికల సంఘం గతంలోనే ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని కూడా ధర్మాసనం ప్రస్తావించింది. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల అమలుపై రాష్ట్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్లు సమర్పించాల్సి ఉంది.

63 శాతం మందిని అడ్డుకున్నారంటూ వాదనలు

వైయస్సార్‌సీపీ తరఫున సీనియర్ న్యాయవాది మణీందర్ సింగ్ సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. దాదాపు మూడింట రెండొంతుల మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డంకులు ఎదుర్కొన్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 63 శాతం మంది అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, ఫలితంగా ఆయా స్థానాల్లో అధికార పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. నామినేషన్ పత్రాలను చించివేయడం, అభ్యర్థులను బెదిరించడం, హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియోలు ఉన్నాయని కోర్టుకు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే హింసపై ఆందోళన వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని గుర్తుచేశారు. అభ్యర్థుల ఫిర్యాదులపై పోలీసులు నిర్లక్ష్యంగా, ఏకపక్షంగా వ్యవహరించారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కాపాడేందుకు న్యాయస్థానాల జోక్యం అవసరమని వాదించారు.

Main Edition
21 Oct 2026 Page No. 2